బొమ్మనహాల్‌లో వర్షానికి తడవకుండా మొక్కజొన్నపై కప్పిన తార్పాలిన్లు

ముసురుకున్న మాండూస్..!

◆ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జడివాన ◆ అప్రమత్తత ప్రకటించిన అధికారులు

బుక్కరాయసముద్రం మండలంలో వరి తడవకుండా ప్లాస్టిక్ పేపర్లు కప్పుతున్న రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాండూస్ తుఫాను ప్రభావం ఉమ్మడి అనంతపురం జిల్లాపై పడింది. శుక్రవారం రాత్రి నుంచే జిల్లాలో మబ్బులు కమ్ముకున్నాయి. ఇక శనివారం ఉదయం నుంచి ఏకధాటిగా చిరుజల్లులు పడుతూనే ఉన్నాయి. ఎక్కడా భారీ వర్షాలు పడనప్పటికీ ఏకధాటిగా పడుతున్న వర్షాలతో చిత్తడి నెలకొంది. తుపాను తీరం దాటిన నేపథ్యంలో భారీ వర్షాలు పడే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికి జిల్లా యంత్రాంగం హెచ్చరికలు జారీ చేసింది. పుట్టపర్తిలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్టు అక్కడి జిల్లా కలెక్టర్ బసంత్ కుమార్ తెలిపారు.

తేలికపాటి వర్షాలే...

శుక్రవారం రాత్రి నుంచే వర్షాలు మొదలైనప్పటికీ ఎక్కడా భారీ వర్షాలు పడలేదు. సత్యసాయి జిల్లాలో ఎన్‌పికుంటలో అత్యధికంగా 16.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, అమడగూరులో 14.8 మిల్లీమీటర్లు నమోదయింది. సత్యసాయి జిల్లా అంతటా చూసినప్పుడు సగటున 4.9 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. అనంతపురం జిల్లా పరిధిలో యల్లనూరులో 8 మిల్లీమీటర్లు, నార్పలలో 6.8 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయ్యింది. ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై మబ్బులు కమ్ముకుని ఉన్నాయి. ఈదురుగాలులతోపాటు చిరుజల్లులు పడుతుండటంతో జనం బయటకు రావాలంటే భయపడే పరిస్థితి నెలకొంది. ఒకవైపు చలి మరోవైపు చిరుజల్లులు జనాలను వణికించాయి.

పంటలపై తీవ్ర ప్రభావం

ఎడతెరిపిలేకుండా పడుతున్న చిరు జల్లుల ప్రభావం పంటలపై తీవ్రంగా ఉండే అవకాశముంది. గత నెలలో పడిన అధిక వర్షాలక ఇప్పటికే పెద్దఎత్తున పంటలకు తెగళ్ల వ్యాపించాయి. పత్తి పంట దిగుబడి పూర్తిగా దెబ్బతింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో సుమారు 2.10 లక్షల ఎకరాల్లో పత్తి పంట ఉంది. మొదటి కోత అయిపోయి రెండో కోత దశలో ఉన్న సమయంలో పడుతున్న సమయంలో ఈ వర్షాలకు తెగుళ్ల మరింత వ్యాపించే అవకాశముందని రైతుల ఆందోళన చెందుతున్నారు. ఇక 70 వేల ఎకరాల్లో వేసిన మిరప పంటది ఇదే పరిస్థితి. నల్లతామర తెగుళ్ల ఇప్పటికే పంట దిగుబడులపై ప్రభావం చూపింది. ఇప్పుడు మరిన్ని తెగుళ్ల వ్యాపిస్తే పంట చేతికొచ్చింది పోయే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన పంటల్లో ప్రధాన పంట అయిన అరటికి సిగటోమా తెగుళ్ల ఈ వాతావరణంలో అధికమై చేతికొచ్చిన పంట రైతుకు దక్కకుండాపోయే అవకాశాలున్నాయి. ఇప్పటికే తోటల్లో సిగటోమా లక్షణాలు అధికంగా ఉన్నాయి. ఈ వర్షాలకు మరింత నష్టం జరుగనుందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

అప్రమత్తంగా ఉండాలి : సత్యసాయి జిల్లా కలెక్టర్

మాండూస్ తుఫాను తీరం దాటిన సమయంలో వర్షాలు అధికంగా పడే అవకాశాలున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్యసాయి జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. జిల్లాలో రెండు రోజుల పాటు అధిక వర్షాలొస్తాయని వాతావరణ శాఖ సూచించిందని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా పుట్టపర్తి కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఏదైనా ఇబ్బంది ఉంటే 08555292432, 9154968578 నంబరుకు ఫోన్ చేసి సమాచారమివ్వాలని తెలిపారు.

తడిసి ముద్దవుతున్న ధాన్యం

బొమ్మనహాల్ : తుంగభద్ర ఆయకట్టు కింద పంటలు కోసి కుప్పవేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కురుస్తున్న వర్షాలకు తడిసి ముద్దవుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని సగం మంది రైతులు వరి, మొక్కజొన్న పంటలు కోత కోశారు. వాటిని కుప్పగా పోశారు. వర్షాలకు అవి తడిసి ముద్దవుతున్నాయి. కోతకోయని పంటలు వర్షాలకు పొలాల్లో నేలవాలాయి. పంట చేతికొచ్చే సమయంలో నోటికి అందకుండా పోయిందని రైతులు వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం, సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు.

బుక్కరాయసముద్రం : తుఫానుతో కురుస్తున్న వార్షాలకు మండలంలో దాదాపు 300 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి శివారెడ్డి తెలిపారు. ప్రభుత్వం రైతులను ఆదుకోవాలని కోరారు. పంటచేతికొచ్చే సమయంలో కురుస్తున్న వర్షాల వల్ల వరి, మొక్కజొన్న పంటలు నేలవాలాయని రైతులు వాపోతున్నారు.

అకాల వర్షం.. రైతుకు నష్టం..

చెన్నేకొత్తపల్లి మండలం ద్యామాజీపల్లిలో వర్షంతో మునిగిని కాకరపంట

చెన్నేకొత్తపల్లి : అకాల వర్షాలతో చెన్నేకొత్తపల్లి మండలం ద్యామాజుపల్లి గ్రామంలో యువ రైతు అనంతరెడ్డి కాకర పంట మొత్తం నీటమునిగింది. అనంతరెడ్డి రెండు ఎకరాలను కౌలుకు తీసుకుని అందులో కాకర పంటను సాగు చేశాడు. తుపాన్ ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలకు పంట మొత్తం నీటి మునిగింది. పంట సాగునిమిత్తం రైతు రూ.2 లక్షలు అప్పుచేసి ఆధునిక పద్ధతిలో కాకర కట్టి కట్టి సాగు చేసేడు. కోత దశలో ఉండగా ప్రస్తుతం పడిన వర్షంతో పంట మొత్తం చేతికందకుండా పోయింది. వ్యవసాయ అధికారులు పంట నష్టాన్ని అంచనా వేసి తనకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చూడాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

వర్షాలతో మల్బరీకి నష్టం

లేపాక్షి : తుపానుతో కురుస్తున్న వర్షాలతో మండల పరిధిలోని మామిడిమాకులపల్లి గ్రామంలో మల్బరీకి తీవ్ర నష్టం వాటిల్లింది. రైతులు నంజిరెడ్డి, రాఘవేంద్రరెడ్డిలు సాగు చేసిన 80 చంద్రికలకు తడి తగిలి గూళ్లను అల్లలేదు. దీంతో దాదాపు రూ.70 వేల నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంట నాశనం అయ్యిందన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

సిపిఎం, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు

రాయదుర్గం : రాయదుర్గం పట్టణానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్న సందర్భంగా వామపక్ష పార్టీలు, విద్యార్థి యువజన సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయటాన్ని సిపిఎం, ఎఐఎస్ఎఫ్, ఎఐవైఎఫ్ నాయకులు తీవ్రంగా ఖండించారు. కనీసం మంత్రిని కలిసి రాయదుర్గం ప్రాంతంలో ప్రజలు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, నిరుద్యోగులు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రాన్ని అందించడానికి అనుమతిని నిరాకరించడం శోచనీయమన్నారు. ముఖ్య నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అప్రజాస్వామికం అన్నారు. కనీసం వినతిపత్రం ఇచ్చే స్వేచ్ఛను కూడా లేకుండా చేయడం దుర్మార్గమన్నారు. విద్యార్థి యువజన కార్మిక ప్రజా సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు కూడా పోలీసులు అనుమతి ఇవ్వకుండా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం ఎంత మేరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిని వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఇలాంటి అరెస్టులతో ప్రజా ఉద్యమాలను ఆపడం ఎవరితరం కాదన్నారు ఎన్ని అరెస్టులు చేసినా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలను చేయడానికి వామపక్ష పార్టీలు, అనుబంధ సంఘాలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు. అరెస్ట్ అయిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున, ఎఐఎస్ఎఫ్ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు అంజి, రాజు, ఎఐవైఎఫ్ తాలూకా కార్యదర్శి కొట్రేష్, నాయకులు వివేక్ ఉన్నారు.

ఉరవకొండ : ఉరవకొండలో నిర్వహిస్తున్న వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వస్తున్న నేపథ్యంలో ఆయనను అడ్డుకుంటారని సిపిఎం ఉరవకొండ మండల కన్వీనర్ మధుసూదన్, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, రవి, గంగాధర్, రామాంజనేయులు, రాయంపల్లి వెంకటేశులు, మారుతిలను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

బిసిలను కుర్చీలో కూడా కూర్చోనివ్వరా.?

అనంతపురం : వైసిపి ప్రభుత్వంలో బీసీలకు పెద్దపీట అంటూనే జయహో బిసి కార్యక్రమం ముగిసిన వెంటనే బీసీల పట్ల అనంతపురంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రెస్ మీట్‌లో బీసీల ప్రజాప్రతినిధులను ఏ విధంగా నిలబెట్టి మాట్లాడారో సమాధానం చెప్పాలని తెలుగుదేశం పార్టీ బీసీ సెల్ అనంతపురం పార్లమెంటు అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి పోతుల లక్ష్మీ నర్సింహులు శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర గృహ నిర్మాణ మంత్రి జోగి రమేష్ నా జేబులో మనిషి అన్న గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని వ్యాఖ్యల్లో బీసీ మంత్రి పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. బహిరంగ ప్రదేశాలలో, విలేకరుల సమావేశాలలో ఈ విధంగా బీసీ ప్రజాప్రతినిధుల పట్ల వైకాపాలోని పెద్దల వ్యవహార శైలి చూసే తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వర్యులు చంద్రబాబునాయుడు రాష్ట్రంలో నలుగురు వ్యక్తుల కనుసైగల్లో పాలన కొనసాగుతోందని అంటున్నారన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా వెనుకబడిన వర్గాల వారికి తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. బీసీలందరూ ఏకమై వైసిపి పాలనకు గట్టి గుణపాఠం తెలపాలని పిలుపునిచ్చారు.

175 స్థానాల్లో గెలుపే లక్ష్యం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ప్రజాశక్తి-ఉరవకొండ

ఈసారి జరగబోయే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, అందుకు తగ్గట్టుగా ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేయాలని పార్టీ రీజనల్ కోఆర్డినేటర్, అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. 175 స్థానాల్లో గెలిస్తే మరో 30 ఏళ్లు మనదే ప్రభుత్వమని ధీమా వ్యక్తం చేశారు. శనివారం ఉరవకొండలోని సత్యం కన్వెన్షన్ హాల్లో నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన వైసిపి నియోజకవర్గ విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్‌ఛార్జి మంత్రితో పాటు జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, అనంతపురం, చిత్తూరు ఎంపీలు తలారి రంగయ్య, రెడ్డప్ప, జెడ్పీ ఛైర్ పర్సన్ గిరిజమ్మ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఉరవకొండ నియోజకవర్గ పార్టీ పరిశీలకుడు చిత్తూరు జెడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాయలసీమ వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో పార్టీ సమన్వయ సమీక్షలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామస్థాయి నుంచి పార్టీని మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళికలు తయారు చేశామన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదని క్యాడర్‌కు భరోసా ఇచ్చారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీల్లో 95 శాతం అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి దేశంలో ఎవరైనా ఉన్నారంటే అది జగన్మోహన్ రెడ్డి ఒక్కరే అన్నారు. అధినాయకుడు జగన్మోహన్ రెడ్డి ఎవరిని సూచిస్తే ఆ అభ్యర్థి విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి పార్టీని గెలిపించాలన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించాల్సిందేనని ఎవరైనా ధిక్కరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో సైనికుల్లా పనిచేసి జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు కనుగుణంగా 175 స్థానాలు గెలిచేలా కృషి చేయాలని సూచించారు. ఎల్లో మీడియా ప్రచారాన్ని నమ్మేస్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. బీసీలకు పెద్దపీట వేసి వారిని ఉన్నత స్థానాల్లో నిలిపిన ఘనత వైసిపిదే అన్నారు. ఈ సారి అందరూ కలిసి కట్టుగా పనిచేసి ఉరవకొండ వైసిపి అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఉరవకొండ అసెంబ్లీ స్థానంలో ఈసారి ఘన విజయం సాధించి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామని విశ్వేశ్వరరెడ్డి చెప్పారు. టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ప్రజల్లోకి వచ్చే ధైర్యం లేదన్నారు. కేవలం మొక్కుబడిగా కార్యక్రమాలో పాల్గొంటున్నాడని ఎద్దేవా చేశారు. ఒక్కరోజైనా ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసినా పాపాన పోలేదని విమర్శించారు. హంద్రీనీవా ద్వారా బెలుగుప్ప మండలంలోని చెరువులకు నీళ్ల ఇస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వైసిపి కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపిటీసీలు, వార్డు సభ్యులు, మైనార్టీ నేతలు, డైరెక్టర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయదుర్గం : వైసిపి రాయదుర్గం నియోజకవర్గం విస్తృత సమావేశం శనివారం సాయంత్రం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. జిల్లా పార్టీ ఇన్‌ఛార్జి పైలా నరసింహయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో స్థానిక శాసన సభ సభ్యులు, విప్ కాపు రామచంద్రారెడ్డి, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖా మంత్రి ఉషాశ్రీ చరణ్, అనంతపురము పార్లమెంటరీ సభ్యులు తలారి రంగయ్య, ఏపీఐఐసీ చైర్‌పర్సన్ మెట్టు గోవిందరెడ్డి, ఉమ్మడి అనంతపురము జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల పక్షపాతిగా పాలన సాగిస్తున్నారని, ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ఆర్థిక భరోసా కల్పిస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాలన ఇంకా 2 సంవత్సరాలు ఉండగానే జగన్ మోహన్ రెడ్డిలా ప్రజా ప్రతినిధులను ప్రజల గడప గడప వద్దకు పంపి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగే దమ్ము ఏ ప్రభుత్వానికైనా ఉందా అని ప్రశ్నించారు. రాబోవు ఎన్నికల్లో 175 స్థానాలు గెలిచి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేస్తామన్నారు.

నాసిరకం వేరుశనగ విత్తనకాయలు సరఫరా

మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

నాసిరకం విత్తనాలు చూపుతున్న రైతులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా రబీలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ వేరుశనగ విత్తనాలు నాసిరకంగా ఉన్నాయని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టరుకు శనివారం లేఖ పంపారు. విత్తన వేరుశనగ సేకరణలో అధికారుల పర్యవేక్షణా లోపం కారణంగా విత్తనాభివృద్ధి సంస్థకు నాసిరకం కాయలు అందినట్లు తెలుస్తోందన్నారు. రెండు రోజుల క్రితం తాను గుమ్మగట్ట మండలం భూపసముద్రం గ్రామంలో పర్యటించిన సమయంలో నాసిరకం విత్తనాలపై పలువురు రైతులు ఫిర్యాదు చేశారన్నారు. అక్కడి రైతుభరోసా కేంద్రం ద్వారా ఇచ్చిన నాసిరకం కాయలను చూపించి ఆవేదన వ్యక్తంచేశారన్నారు. తన పర్యటనలో విత్తనం కాయలను పరిశీలించిన ఫొటోలను కూడా పరిశీలన కోసం పంపుతున్నానన్నారు. సదరు విత్తనాలను భూమిలో వేస్తే 40 శాతం కూడా మొలకలు వచ్చే అవకాశం లేదని రైతులు చెబుతున్నారన్నారు. రబీ సీజనులో రైతులకు సుమారు 40 శాతం సబ్సిడీతో విత్తనం అందిస్తున్నారని, రాయితీ పోను రైతు క్వింటాలుకు రూ.5400 దాకా చెల్లిస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వం సరఫరా చేసే విత్తనం వేరుశనగ ఎంతో నాణ్యతగా ఉండేదని గుర్తు చేశారు. వివిధ దశల్లో తనిఖీల తరువాతే విత్తనం రైతుకు చేరేదన్నారు. గోడౌన్లలో విత్తనాలను పరిశీలించిన పిమ్మట అవి బాగుంటేనే వాటిని కొనుక్కునే వెసులుబాటు రైతులకు ఉండేదన్నారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదన్నారు. రైతుభరోసా కేంద్రాల ద్వారా రాయితీ విత్తనం పొందాలంటే ముందుగానే డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. విత్తనం అందుకున్న తర్వాత నచ్చకపోతే వాపసు ఇచ్చే పరిస్థితి ఇప్పుడు లేదన్నారు. నచ్చినా నచ్చకపోయినా వాటిని తీసుకోక తప్పడంలేదన్నారు. ప్రభుత్వంపై నమ్మకంతో ముందుగానే డబ్బులు కట్టిన పేద రైతులకు నాసిరకం విత్తనం ఇవ్వడం భావ్యం కాదన్నారు. విచారణ జరిపించి, నాసిరకం విత్తన సేకరణకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కాలవ డిమాండ్ చేశారు. రైతులకు నాణ్యమైన విత్తనం అందేలా చూడాలని ఆయన కోరారు.

మహిళలపై హింసను అరికట్టడం అందరి బాధ్యత

ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి

అనంతపురం కలెక్టరేట్ : మహిళలపై హింసను అరికట్టడానికి మనమందరం బాధ్యతగా వ్యవహరించాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ పీడీ శ్రీదేవి, దిశ డిఎస్పీ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల చట్టాలపై సాధికారత మహిళలపై వేధింపుల నిరోధం, నిషేదం, పరిహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఐసిడిఎస్ పీడీ బిఎన్.శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి దిశా డీఎస్పీ శ్రీనివాసులు, డిఆర్‌డిఎ పీడీ నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాతీయ స్త్రీ హింస నిర్మూలనా పక్షోక్షవాలలో భాగంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో 15 రోజుల పాటు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారత కోసం, బాలల హక్కుల పరిరక్షణ కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో చట్టాలు పథకాలు అమలు చేస్తున్నప్పటికీ నేటికీ సమాజంలో మహిళలు, బాలికలు హింసకు గురవుతుండడం బాధాకరమన్నారు. ఆపద సమయంలో సత్వర సహాయం కోసం 24 గంటలు పనిచేస్తున్న చైల్డ్‌లైన్ 1098, ఉమెన్ హెల్ప్ లైన్ 181 పోలీస్ హెల్ప్ 100 లకు ఫోన్ చేయవచ్చునని తెలిపారు. ముఖ్యంగా మహిళలు బాలికలు ప్రతి ఒక్కరూ తమ మొబైల్ ఫోన్ నందు తప్పనిసరిగా దిశా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయాలలో తమను తాము రక్షించుకోగలరని సూచించారు. రెబ్కా, మహిళా సాధికారత సమన్వయకర్త, ఆర్ట్స్ కాలేజ్ మెంబర్ కామేశ్వరి, రెడ్స్ సంస్థ భానూజ, జిల్లా బాలల పరిరక్షణ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం, సిడిపిఓలు లలిత, నాగమణి, ఉమాశంకరమ్మ, ప్రభావతి, ధనలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్‌లు చైల్డ్ లైన్ జిల్లా సమన్వయ కర్త కృష్ణమాచారి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఒఎస్‌సి మేనేజర్ శాంతామణి, డివి లీగల్ కౌన్సిలర్ నర్మద, ఐసిపిస్ అధికారులు వెంకటేశ్వరి, చంద్రకళ, సంధ్యారాణి, శ్రీలక్ష్మి, సిబ్బంది రాజేష్, సంధ్య, వసంత, రమాదేవి, ఆనంద్, సిబ్బంది శ్రీకల, మంజుల, పారామెడికల్ లక్ష్మీదేవి, రజిత కార్యకర్తలు పాల్గొన్నారు.

కౌలురైతులందరికీ రుణాలు ఇవ్వాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో 2019 కౌలుదారీ చట్టం ప్రకారం సిసిఆర్‌సి ఉన్న కౌలు రైతులందరికి బ్యాంకు రుణాలు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.రంగారెడ్డి, ఎం.బాలరంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 56000 కౌలు రైతులకు ప్రభుత్వం కేవలం 2630 మందికి మాత్రమే కౌలు రైతు గుర్తింపు కార్డులు (సిసిఆర్) ఇచ్చారని తెలిపారు. ఇవి కూడా దేవాదాయ భూముల కౌలు రైతులకు మాత్రమే ఇచ్చారని తెలిపారు. కౌలు దారి చట్టం ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు కౌలు రైతులకు ఇవ్వాలని ఉంటే ఏఒక్క కౌలు రైతుకూ బ్యాంకు రుణాలు ఇచ్చిన పాపాన పోలేదన్నారు. ప్రభుత్వం వెంటనే సిసిఆర్‌సి ఉన్న కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. ఇది వరకే అనేక సార్లు పోరాటాలు చేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. స్పందన గ్రీవెన్స్‌సెల్‌లో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశామన్నారు.

కడప ఉక్కు పరిశ్రమ సాధన పాదయాత్రకు మద్దతు

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి నాగరాజు

అనంతపురం కలెక్టరేట్ : రాష్ట్ర పునర్విభజన చట్టంలో పేర్కొన్న కడప ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయడంలో ముఖ్యమంత్రి వైఫల్యాలను ప్రజలకు, కేంద్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ చేపట్టిన పాదయాత్రకు రాయలసీమ పట్ట భద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజు హాజరై సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే అన్ని వ్యవస్థలను నాశనం చేసిన ముఖ్యమంత్రి రాయలసీమ అభివృద్ధికి ఉపయోగకరమైన కడప ఉక్కు పరిశ్రమను పునాది రాళ్లకు పరిమితం చేశారని విమర్శించారు. దీని వల్ల 10 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు పరోక్షంగా లక్షల మందికి ప్రయోజనం కలిగేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన ప్రాజెక్టు అయిన రాష్ట్ర ప్రభుత్వం సహకారాన్ని అందించక పోవడంతో రాయలసీమ ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతిని ముఖ్యమంత్రి అడ్డుకుని ఈ ప్రాంత ప్రజల అభివృద్ధి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు లేకుండా చేశారని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని కడప ఉక్కు పరిశ్రమను వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. వీటి కోసం నిధులను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ఒడి బియ్యం కానుకలు ఇస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

ఒడిబియ్యం కానుక అందజేత

ఆత్మకూరు : ఆత్మకూరు మండలం తోపుదుర్తి గ్రామంలో ఈనెల 7వ తేది నుంచి 9వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం గ్రామంలోని మహిళలకు, పెళ్లిళ్లు చేసుకుని ఇతర ప్రాంతాల్లో ఉంటున్న గ్రామ ఆడబిడ్డలకు ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు ఒడి బియ్యం కానుకను అందజేశారు. దాదాపు 3 వేల మంది మహిళలకు ఒడి బియ్యం పోసి పసుపు కుంకుమ పెట్టి చీరలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి, తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్లూరు : మండలంలో ఖాళీగా ఉన్న ఆశావర్కరు పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని వైద్యాధికారి శ్రీవాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్.గూడూర్ సంబంధించి 1 ఆశావర్కర్ పోస్ట్ ఖాళీగా ఉందన్నారు. అర్హులు ఈనెల 11వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పవన్‌కుమార్ రెడ్డిని పరామర్శించిన జెసి.ప్రభాకర్‌రెడ్డి

పుట్లూరు : మండల పరిధిలోని సంజీవపురం గ్రామానికి చెందిన మోటాటి పవన్‌కుమార్‌రెడ్డి ద్విచక్ర వాహనంలో వెళ్తూ కిందపడి కాలు విరిగింది. శనివారం మాజీ ఎమ్మెల్యే, తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి పవన్ స్వగృహానికి ఆయనను పరామర్శించారు ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు.

వృకాసం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సూరి

పుట్లూరు : పుట్లూరు మండలం కడవకల్లు గ్రామానికి చెందిన ఎస్.సూరి రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఎపి వ్యవసాయ కార్మిక సంఘం 29వ మహాసభల్లో ఆయనను ఎన్నుకున్నారు. ఆయనకు మండల సిపిఎం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అభినందనలు తెలిపారు.

రైతుసంఘం నూతన కమిటీ ఎన్నిక

శింగనమల : శింగనమల మండలం ఇరువెందుల గ్రామానికి చెందిన రైతు సంఘం నూతన కమిటీని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షులు, చంద్రశేఖర్ రెడ్డి, కార్యదర్శిగా వెంకటరామిరెడ్డి, సహాయ కార్యదర్శిగా రామిరెడ్డి, 9మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతపురం గ్రామానికి చెందిన 15 మంది రైతు సంఘంలో చేరారు. ఈ సంద్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.చిన్నప్ప యాదవ్ మాట్లాడుతూ.. రైతుల సమస్యలపై ఈనెల 12వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం శింగనమల నియోజకవర్గ అధ్యక్షులు మధుయాదవ్, ఓబులపతి, నేసే మధు, కొండపల్లి చంద్రశేఖర్, బయన్న, పలువురు రైతులు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి పరామర్శ

కళ్యాణదుర్గం : మున్సిపాలిటీ పరిధిలోని గూబనాపల్లి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకురాలు తలారి సమ్మక్కమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వర్ నాయుడు, నాయకులు కార్యకర్తలు గూబనాపల్లి గ్రామానికి వెళ్లి సన్నక్క పార్థివదేహానికి పూలమాలువేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ లీగ్ టోర్నమెంట్ విజేత బికెఎస్ జట్టు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

అనంతపురం ఆర్‌డిటి స్పోర్ట్స్ విలేజ్‌లో ఈనెల 9, 10 తేదీలలో జరిగిన జిల్లా మిక్స్ జెండర్ సాఫ్ట్‌బాల్ లీగ్ టోర్నమెంట్‌లో బుక్కరాయసముద్రం జట్టు ఏడు మ్యాచ్‌లలో విజయం సాధించి మొదటి స్థానంలో నిలిచింది. శనివారం ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, గ్రాస్ రూట్ కోఆర్డినేటర్ శ్రీ ఓబులేష్ చేతుల మీదుగా విన్నర్స్ కప్పును బుక్కరాయసముద్రం క్లబ్ జట్టు సభ్యులు గోపాల్ రెడ్డి, సింహాద్రి, కెజిబివి పిఇటి భాగ్య అందుకున్నారు. ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సీఈవో వెంకటేశులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమంగళి, ఆంధ్రప్రదేశ్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ నాగేంద్ర బుక్కరాసముద్రం జట్టుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

విజేత జట్టు సభ్యులు

రాజకీయ 'చలి' మంటలు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

చలికాలంలో చలి అధికమైన అందరినీ వణికిస్తోంటే, రాజకీయాలు మాత్రం మంటలు పుట్టిస్తున్నాయి. ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు సిద్ధపడుతున్నట్టుగా కనిపిస్తున్నాయి. అధికార వైసిపి ముందుగా కసరత్తును ప్రారంభించిందనే చెప్పాలి. వైసిపి రాయలసీమ బాధ్యులుగానున్న, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లాలో విస్తృతమైన పర్యనటలు చేపట్టారు. గతంలో ఒక రోజుతోనే పర్యటనలు ముగిసేవి. ఇప్పుడు వరుసగా జిల్లాలోనే ఉంటూ నియోజకవర్గాల వారీగా సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎక్కడైనా నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయలోపాలుంటే వాటిని సరిచేసే కార్యక్రమాలను చేపట్టారు. ఇప్పటికే కళ్యాణదుర్గం, ఉరవకొండ పూర్తిచేశారు. మరో రెండు రోజులు ఉండి మరిన్ని నియోజకవర్గాల సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీంతో ఎన్నికల వేడి అప్పుడే మొదలైనట్టుగా కనిపిస్తోంది. ఈ సమావేశాల్లోనూ అటువంటి సంకేతాలే ఇస్తుండటంతో అధికార వైసిపిలో అప్పుడే ఎన్నికల హడావుడి మొదలైంది. అంతేకాకుండా నిఘా వర్గాల ద్వారా గెలుపు గుర్రాల అన్వేషణ మొదలైంది. ఇప్పుడున్న నేతల పనితీరుతోపాటు, కొత్తవారైతే ఎలాగుంటారన్న ఆరాలను తీస్తున్నారు. అందుకోసం సర్వేలు కొనసాగుతున్నాయి. ఇక ప్రతిపక్ష టిడిపి కూడా ఎన్నికల కసరత్తులోకి దిగేందుకు సిద్ధపడుతోంది. ఇప్పటికే ఇదేం ఖర్మ అంటూ వైసిపి పాలనకు వ్యతిరేకంగా ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యమ్రంలో ముఖ్య నేతలు పాల్గొంటున్నారు. ఇక రాప్తాడు, తాడిపత్రి నియోజకవర్గాల్లో అధికారపార్టీకి వ్యతిరేకంగా పోటాపోటీగా చేపడుతున్న కార్యక్రమాలు మరింత వేడిని రగులుస్తున్నాయి. ఈ రెండు చోట్ల కొంత ఉద్రిక్తత పరిస్థితులే కొనసాగుతున్నాయి. రెండు ప్రధాన పార్టీలు ఈ రకంగా ఎన్నికలపై దృష్టి సారించే పనిలో ఉంటే, సిపిఎం రైతాంగ సమస్యలపై పోరాటాలకు సిద్ధమవుతోంది. అధిక వర్షాలతో దెబ్బతిన్న పత్తి రైతులను ఆదుకోవాలని ఉద్యమానికి సిద్ధమైంది. గత సోమవారం నాడు జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. నకిలీ పత్తి విత్తనాలు, ప్రకృతి వైపరిత్యం రెండింటి మూలంగా దెబ్బతిన్న పత్తి రైతులను ఆదుకోవాలని వరుసగా కార్యక్రమాలను రూపొందించడం జరుగుతోంది. అదే సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మార్పులను పరిశీలించేందుకు సర్వేలను ఆ పార్టీ గ్రామ స్థాయిలో చేపడుతోంది. తద్వారా గ్రామీణ ప్రాంత ప్రజల జీవన ప్రమాణాల్లో వచ్చిన మార్పులు, ఇబ్బందులను తెలుసుకుని అందుకు అనుగుణంగా కార్యక్రమాలను రూపకల్పన చేసే పనిని చేపడుతోంది. జిల్లాలో ఇందుకు అవసరమైన కసరత్తు సిపిఎం చేస్తోంది. ఇక అఖిల భారత కిసాన్ సభ్ (ఎఐకెఎస్) దక్షిణ భారత జీపు జాతా జిల్లాలో సాగింది. ఈ జీపు జాతాలో ఢిల్లీలో మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమంలో చనిపోయిన రైతులను స్మరించుకుంటూ అమరవీరుల జ్యోతి యాత్ర పేరుతో చేపట్టింది. ఈ కార్యక్రమంలో ఎఐకెఎస్ నాయకులు కృష్ణప్రసాద్, సాగర్, ప్రకాశం మాస్టరు పాల్గొన్నారు. పామిడి, అనంతపురం మీదుగా కర్నాటక బాగేపల్లి వరకు సాగింది. ఈ యాత్ర బృందం మధ్యలో పత్తి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. రైతు వ్యతిరేక విధానాలపై రైతాంగం ఐక్య పోరాటాలకు సన్నద్ధమవ్వాలని పిలుపునిచ్చారు. వారం చివర్లో తుఫాను ప్రభావంతో తేలికపాటిక వర్షాలు పడ్డాయి.

నేడు సన్ రే ఆసుపత్రి ప్రారంభం

ప్రజాశక్తి-అనంతపురం

స్థానిక బళ్లారి రోడ్డు నడిమి వంక జంక్షన్‌లో నూతనంగా నిర్మించిన సన్ రే హాస్పిటల్‌ను 11వ తేదీ ఆదివారం లాంచనంగా ప్రారంభించనున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్‌రెడ్డి, డాక్టర్ సురేంద్రబాబు, కె.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి కేవీ ఉషశ్రీ చరణ్ హాజరవుతున్నట్లు తెలిపారు. వీరితో పాటుగా ఎంపీ తలారి రంగయ్య, గోరంట్ల మాధవ్, ఎమ్మెల్యేలు అనంత వెంకట్రామిరెడ్డి, వై.వెంకట్రామిరెడ్డి, జొన్నలగడ్డ పద్మావతి, ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, జడ్పీ ఛైర్మన్ గిరిజమ్మ, విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్ రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మేయర్ వసీం, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ ఫక్కీరప్ప, అధ్యక్షులు మనోరంజన్‌రెడ్డి, కార్యదర్శి అభిషేక్‌రెడ్డి తదితరులు హాజరవుతున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించేందుకు నూతన హంగులతో ఆధునిక పద్ధతులతో సన్ రే హాస్పిటల్‌ను రూపొందించినట్లు తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తప్పులు లేని ఓటరు జాబితానే లక్ష్యం

రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు మురళీధర్ రెడ్డి

మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు మురళీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-గుత్తి

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు డి.మురళీధర్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శనివారం జిల్లా రెవెన్యూ అధికారి గాయత్రీదేవితో కలిసి ఆయన జిల్లాలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల పరిశీలకులు మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ జనవరి ఒకటవ తేదీన విడుదల చేసే ఓటరు జాబితాలో సవరణలపై సమీక్షించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. విఐపి, వివిఐపి జాబితాలో ఓట్లు ఉన్నాయో లేవో చూడాలన్నారు. అలాగే దొంగ ఓట్లు, మరణించిన వారి ఓట్లను తొలగించాలన్నారు. డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 18 ఏళ్లు నిండిన విద్యార్థులను ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో భాస్కర్ రెడ్డి, గుంతకల్లు, కళ్యాణదుర్గం ఆర్డీవోలు రవీంద్ర, నిశాంత్ రెడ్డి, డీఆర్డీఏ పీడీ నరసింహారెడ్డి, హౌసింగ్ పీడీ కేశవ నాయుడు, పీఏబీఆర్ సబ్‌కలెక్టర్ సుధారాణి, తహశీల్దార్ ఎస్.మహబూబాషా తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి జగన్ పెద్దపీట

ముస్లిములను ఓటు బ్యాంకుగా వాడుకున్న చరిత్ర చంద్రబాబుది

నగర మేయర్ మహమ్మద్ వసీం

మాట్లాడుతున్న మేయర్ వసీం

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అధికారంలోకి వస్తే మైనార్టీలకు పెద్దపీట వేస్తామంటున్న చంద్రబాబు నాయుడు గతంలో14 ఏళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తింపు ఇవ్వలేక పోయారని నగర మేయర్ మహమ్మద్ వసీం ప్రశ్నించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మేయర్ వసీం ముస్లిం మైనార్టీ కార్పొరేటర్లతో కలిసి శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొన్నూరులో టీడీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మైనార్టీ సదస్సులో ప్రతిపక్ష నేత చంద్రబాబు నాయుడు టీడీపీ అధికారంలోకి రాగానే ముస్లిం మైనారిటీలకు మంత్రి మండలిలో ప్రాధాన్యత కల్పిస్తామని, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మైనార్టీ మంత్రిగా పల్లె రఘునాథరెడ్డికి ఇచ్చినప్పుడు మైనార్టీలు గుర్తుకు రాలేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముస్లిం మైనార్టీలకు మాటలు చెప్పి మోసం చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. గతంలో ముస్లిం మైనారిటీలను ఓటు బ్యాంకు గానే వాడుకున్నారని విమర్శించారు. టోపీ పెట్టుకుని మాటలు చెప్పి ముస్లిం మైనారిటీలకు టోపి పెట్టాలని చూస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు మాటలు విని మోసపోయే పరిస్థితుల్లో ముస్లిం మైనారిటీలు లేరని అన్నారు. ముస్లిం మైనార్టీల సంక్షేమం వైఎస్ కుటుంబం వల్ల మాత్రమే సాధ్యమవుతోందన్నారు. నాడు వైయస్ రాజశేఖర్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు 4 శాతం రిజర్వేషన్లను ముస్లిం మైనార్టీలకు అందించడం వల్ల నేడు ఎందరో ముస్లిం యువకులు ఉన్నత స్థానాలలో ఉన్నారన్నారు. అదే స్ఫూర్తితో నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు రాజకీయ ప్రాధాన్యతను కల్పించడంతోపాటు ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తున్నారన్నారు. నేడు ఉప ముఖ్యమంత్రి పదవితోపాటు ఎమ్మెల్యేలుగా ఎమ్మెల్సీలుగా మేయర్లు వంటి అత్యున్నత పదవులలో మైనార్టీలను నియమించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి దక్కుతోందన్నారు. అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి చొరవతో మేయర్ గానే కాకుండా 10 మందికి కార్పొరేటర్లు గాను ఒక కో ఆప్షన్ సభ్యునిగాను అనంతపురం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ గాను జిల్లా చరిత్రలోనే తొలిసారి ఇన్ని పదవులను ముస్లిం మైనార్టీలకు నగరంలో అవకాశం కల్పించారన్నారు. ముస్లిం మైనార్టీల కోసం హజ్ యాత్రకు సాయం అందించడం,ఇమామ్, మౌజం లకు వేతనాలను అందించడం, సబ్ ప్లాన్ అమలు, మసీదుల అభివృద్ధికి ప్రతి నియోజకవర్గానికి నిధులు కేటాయించడం వంటి ఎన్నో కార్యక్రమాలను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలుచేస్తూ ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు ఎన్ని జిమ్మిక్కులు చేసినా ముస్లిం మైనార్టీ ప్రజలు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అండగా నిలుస్తారని స్పష్టం చేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో 175 స్థానాలలో వైసిపి విజయం సాధించి మరోమారు ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపడతారని మేయర్ వసీం ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు సైపుల్లా బేగ్, రహంతుల్లా, బాబా ఫకృద్దీన్, ఇషాక్, లాలూ, నాయకులు దాదు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమాన్ని విస్మరించిన జగన్

రాయదుర్గం టిడిపి మైనార్టీ నాయకులు

మాట్లాడుతున్న టిడిపి ముస్లిం మైనార్టీ నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మైనార్టీ సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడంతో పాటు మైనార్టీలకి తీవ్ర ద్రోహం చేశారని రాయదుర్గం పట్టణ టిడిపి మైనార్టీ నాయకులు ఆరోపించారు. శనివారం రాయదుర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పట్టణ మైనారిటీ అధ్యక్షుడు ఇనాయత్ బాషా ఆధ్వర్యంలో మైనార్టీ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు కడ్డీపూడి మహబూబ్ బాషా, జిల్లా కార్యదర్శి ఉస్మాన్ సాబ్ లు మాట్లాడారు. ప్రజావేధిక కూల్చడంతో మొదలైన జగన్మోహన్ అరాచక పాలన అన్ని వర్గాల ప్రజలపై తీవ్ర అసంతృప్తిని కలిగిస్తోందన్నారు. ప్రతిపక్షంలో జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో రూ.50 వేలు ఉన్న దుల్హన్ పథకాన్ని రెట్టింపు చేస్తానని మైనార్టీలను నమ్మబలికాడన్నారు. ముఖ్యమంత్రిగా గెలిచాక జగన్‌రెడ్డి దుల్హన్ పథకాన్ని పూర్తిగా రద్దు చేసి మైనార్టీలకు తీవ్ర అన్యాయం చేశాడన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు నిరుపేద మైనార్టీలకు రంజాన్ తోపా ఇచ్చి ఆదుకొన్నారని గుర్తుచేశారు. వైసిపి ప్రభుత్వం రంజాన్ తోపాను రద్దుచేసి మైనార్టీల కడుపు కొట్టిందన్నారు. మైనార్టీ కార్పొరేషన్ కింద రావాల్సిన స్కాలర్ షిప్, సబ్సిడీ రుణాల్ని కూడా రద్దు చేసిందన్నారు. తెలుగుదేశం ప్రభుత్వంలో నారా చంద్రబాబు నాయుడు మసీదుల నిర్మాణాన్ని, మౌలిక వసతులకు ప్రత్యేక నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, రాయదుర్గంలో కాలవ శ్రీనివాసులు మైనార్టీలకు పెద్ద పీట వేశారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే, మంత్రిగా ఉన్న కాలవ శ్రీనివాసులు నియోజకవర్గ వ్యాప్తంగా మసీదులలో మౌలిక వసతులకు నిధులు ఇచ్చారన్నారు. పట్టణంలో కబరస్తాన్, మసీదుల ప్రహరీ గోడలకు కూడా నిధులు మంజూరుచేశారన్నారు. మూడున్నరేళ్ల గడుస్తున్నా ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి మైనార్టీలకు చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. రాష్ట్రంలో మైనార్టీ అభివృద్ధిని, సంక్షేమాన్ని విస్మరించిన జగన్మోహన్ రెడ్డిని, రాయదుర్గంలో ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డిని గద్దె దించడానికి మైనార్టీలు అంతా ఏకమై కలిసి పోరాడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ ఉపాధ్యక్షుడు జమీల్ ఖాన్, అస్లాం, జిల్లా కార్యదర్శులు జిలాన్, గఫూర్, ఖలందర్, గఫుర్, వాజిద్ సాబ్, అహమ్మది, నిసాన్, ఇస్మాయిల్, ఇబ్రహీం, మహమ్మది తదితరులు పాల్గొన్నారు.

వైసిపిలో బిసిల స్థానం ఎక్కడ ?

జనసేన జిల్లా అధ్యక్షులు టిసి.వరుణ్

ప్రజాశక్తి-అనంతపురం

అధికార వైసీపీలో బీసీల స్థానం ఎక్కడో చెప్పేందుకు అనంతపురం జిల్లా పర్యటనలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వ్యవహార శైలి అద్దం పడుతోందని జనసేన జిల్లా అధ్యక్షులు, అనంతపురం అర్బన్ నియోజకవర్గం ఇన్‌ఛార్జి టిసి వరుణ్ అన్నారు. అనంతపురం జిల్లా పర్యటనలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో తన సహచర మంత్రి, మహిళ అయిన ఉషశ్రీ చరణ్, ఎంపీ తలారి రంగయ్య, జడ్పీ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, వైసిపి జిల్లా అధ్యక్షులు పైలా నరసింహయ్య వంటి బిసి నేతలు మంత్రి పెద్దిరెడ్డి ముందు కూర్చునేందుకు కూడా అవకాశం లేకుండా చేశారన్నారు. బీసీలను తాము అందలం ఎక్కిస్తున్నామని గొప్పగా చెప్పుకుంటూ బిసి గర్జన నిర్వహించిన వైసిపిలో బీసీలకు పెరిగిన గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. జనసేన ద్వారానే బీసీలకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. చిత్తశుద్ధి కలిగిన అధినేత పవన్ కళ్యాణ్ అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యత ఇస్తారన్నారు. బీసీలు జనసేన పార్టీని ఆదరించి పవన్ కళ్యాణ్‌ను ఆశీర్వదించాలని టిసి.వరుణ్ కోరారు.

మీడియాతో మాట్లాడుతున్న టిసి.వరుణ్

నేరాలు ఘోరాలు

లారీ డ్రైవర్ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని వన్నేదొడ్డి గ్రామ సమీపంలో శనివారం ఓ లారీ డ్రైవర్ ఆకస్మికంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రానికి చెందిన పల్లవేలు (50) అనే లారీ డ్రైవర్ మరో డ్రైవర్‌తో కలిసి బెంగళూరు నుంచి హైదరాబాదుకు లోడు లారీతో బయలుదేరాడు. వన్నేదొడ్డి గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారి పక్కన లారీని ఆపి పల్లవేలు మొహం కడుక్కోవడానికి వెళ్లాడు. అక్కడ రక్తపు వాంతులు కావడంతో ఉన్నపలంగా కుప్పకూలి కిందపడి మరణించాడు. ఎస్ఐ శ్రీనివాసులు ఘటనా స్థలానికి వెళ్లి విచారించారు. మృతి చెందిన డ్రైవరు కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఉండేవాడని మరో డ్రైవర్ విచారణలో తేలిందని ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-గుత్తి

మండలంలోని ఎంగిలిబండ బస్టాప్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. 67వ జాతీయ రహదారిపై ఆగి ఉన్న సిమెంటులోడు లారీని గుత్తి నుంచి తాడిపత్రి పైపు వెళుతున్న ఐషర్ వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఐషర్ వాహన డ్రైవర్ అయూబ్ ఖాన్ తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విశ్రాంత రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

4 తులాల బంగారు నగలు, రూ.40 వేలు అపహరణ

ప్రజాశక్తి-గుత్తి

ఆర్ఎస్‌లోని చంద్రప్రియనగర్‌లో ఓ ఇంట్లో చోరీ జరిగింది. విశ్రాంత ఉద్యోగి మల్లికార్జున పని నిమిత్తం రెండు రోజుల క్రితం హైదరాబాదుకు వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని దుండగులు ఇంటి తాళాలు పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాను బద్దలు కొట్టి అందులోని 4 తులాల బంగారు నగలు, 40 వేలు నగదును దోచుకెళ్లారు. శుక్రవారం రాత్రి 12 గంటల సమయంలో ఇంటికి వచ్చిన ఆయన తలుపులు తెరిచి ఉండడం చూసి గదిలోని బీరువాను పరిశీలించారు. చోరీ జరిగిన విషయాన్ని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బీరువా తలుపులను పగులగొట్టిన దుండగులు

12న వైసిపి విస్తృత స్థాయి సమావేశం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గ వైసీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఈనెల 12వ తేదీన నిర్వహించనున్నట్లు అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు గుత్తి రోడ్డులోని విద్యుత్ కళాభారతిలో సమావేశం ఉంటుందన్నారు. పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. వైసీపీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-గార్లదిన్నె

మత్స్యకారుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందని శింగనమల ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. శనివారం ఆమె మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ శాంతితో కలిసి మండల పరిధిలోని ఎంపీఆర్ డ్యామ్‌లో ప్రధానమంత్రి మత్స్య సాగు యోజన మిషన్ ఫింగర్లింగ్స్ పథకం కింద 4 లక్షలా 95 వేల చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వెంకటనారాయణ, తహశీల్దారు ఉషారాణి, ఎంపీడీవో విజయ్ భాస్కర్, ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ హెచ్ఎస్ ఆసీఫ్, మండల కన్వీనర్ నరేందర్‌రెడ్డి, వైసిపి నాయకులు లక్ష్మినారాయణ, ఎంపీటీసీలు, ఫిషరీ స్టాఫ్, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు జీతాలు ఇవ్వండి

చామల అనిల్ వెంకటప్రసాద్ రెడ్డి

పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి

ప్రజాశక్తి-తాడిపత్రి

ఉపాధ్యాయుల ఘోష విని వారికి జీతాలు సక్రమంగా ఇవ్వాలని పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ చామాల అనిల్ వెంకటప్రసాద్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడిపత్రి పట్టణంలోని లార్డ్ హాస్పిటల్ నందు తమ కార్యాలయంలో ప్రజాశక్తితో ఆయన మాట్లాడారు. నెల పూర్తయి 10 రోజులు దాటినా ఉపాధ్యాయులకు జీతాలు రాలేదన్నారు. కొన్ని నెలలుగా ఉపాధ్యాయులు నెల నెలా జీతం వస్తే చాలు అనుకునే మానసిక స్థితికి చేరుకునే పరిస్థితులను పాలకులు తీసుకొచ్చారన్నారు. ఉపాధ్యాయ వ్యవస్థ ఎంతో విలక్షణమైనదన్నారు. ఏ దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలనైనా నిర్మించగల నిర్మాతలు ఉపాధ్యాయులు అన్నారు. అవినీతి మచ్చ అంటకుండా తమకు వచ్చే జీతంలోనే పట్టీ వేసుకుని ఆర్థిక క్రమశిక్షణతో బతికే ఒక సాధారణ వర్గమని తెలిపారు. అలాంటి కుటుంబాలు నెల జీతం సమయానికి రాకపోతే పడే ఇబ్బంది అంతా ఇంతా కాదన్నారు. హోమ్ లోన్, ఈఎంఐ, బైక్ లోన్‌లు ఉంటాయని, అవి బౌన్స్ అయితే సిబిల్ రేటింగ్ దెబ్బతింటుందన్నారు. పిల్లల చదువులకు, పెళ్లిళ్లకు లోన్లు ఇవ్వరన్నారు. పాలకులు ఎలాగూ పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్లు ఇవ్వడంలేదన్నారు. అమ్మ పెట్టదు..అడుక్కుతిననివ్వదు.. అన్న చందంగా ఉపాధ్యాయుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందన్నారు. ప్రభుత్వం ఇకనైనా ఉపాధ్యాయులను కష్టపెట్టే నిర్ణయాలుకాకుండా, ఉపాధ్యాయ వ్యవస్థ, విద్యా వ్యవస్థ నాలుగు కాలాలు పచ్చగా ఉండే నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.

నామకరణం కార్యక్రమంలో మంత్రి ఉష శ్రీచరణ్

ప్రజాశక్తి-కుందుర్పి

కళ్యాణదుర్గం పట్టణ వైసీపీ నాయకుడు తనయుడు నామకరణం, కేశఖండన కార్యక్రమంలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఉష శ్రీచరణ్ దంపతులు పాల్గొన్నారు. శనివారం కుందుర్పి మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో వైసీపీ నాయకులు గురురాజ్ రాయల్ కుమారుడి నామకరణం, కేశ ఖండన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో తన ఆధ్వర్యంలో శ్రీవాత్సవ్ అని నామకరణం చేయడం ఎంతో అదృష్టమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సత్యనారాయణ శాస్త్రి, గ్రామ సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, సింగిల్ విండో ఛైర్మన్ ఎఆర్ వన్నూర్‌రెడ్డి, అప్పిలేపల్లి సర్పంచి హాసీనాబీ, అతావుల్లా, వార్డ్ మెంబర్లు మంజునాథ, వైబి దుర్గమ్మ, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.